క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



రెల్లివీధిలో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు బీటీఆర్ కాలనీ సచివాలయం పరిధి రెల్లి వీధిలో రూ.1.32 కోట్లతో సచివాలయం, కమ్యూనిటీ హాల్, డ్వాక్రా బిల్డింగ్ (జీ ప్లస్ 2) నిర్మాణానికి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏఈ శ్రీరామమూర్తి, డైరెక్టర్ నూకరాజు, పార్టీ నాయకులు భోగవిల్లి గోవింద్, హరి, అశోక్, వెంకటేష్, సన్నీ, స్థానికులు గుడివాడ గౌరునాయుడు, బి.కొండలరావు, యు.అప్పన్న, అల్లు దాలినాయుడు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులకు ట్యాబ్‌ల పంపిణీ



కార్యదర్శికి ట్యాబ్ అందజేస్తున్న జోనల్ కమిషనర్ విజయలక్ష్మి

సీతమ్మధార: ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్–3 కార్యాలయంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఏసీపీ శాస్త్రి ఆధ్వర్యంలో శనివారం టౌన్ ప్లానింగ్ విధుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. రీ సర్వేలో భాగంగా సచివాలయ కార్యదర్శులకు జెడ్పీ చేతుల మీదుగా ట్యాబ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యదర్శి ట్యాబ్ ద్వారా రీ సర్వే చేపట్టాలన్నారు. ప్రతి వార్డులో అనధికార నిర్మాణాలపై దృష్టి సారించాలని, ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో టీపీవో తేజ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో హై టెన్షన్ లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1(ఆపరేషన్స్) ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతం, బిజినెస్ సెంటర్, నరసింహనగర్, విద్యుత్‌నగర్, కిరణ్ పార్క్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఆశీలమెట్ట సెక్షన్‌లో..

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలోని 11 కేవీ బీఎస్ లేఅవుట్, 11 కేవీ శాంతిపురం ఫీడర్లలో మరమ్మతులు, చెట్టు కొమ్మల ట్రిమ్మింగ్ నిమిత్తం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సీతమ్మధార, బీఎస్ లేఅవుట్, సీతంపేట మెయిన్ రోడ్డు, శాంతిపురం, ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

29న మెగా రక్తదాన శిబిరం

ఎంవీపీకాలనీ: ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని మాంక్‌ఫిట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు మహేష్, టి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటల నుంచి ఏయూలోని జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో శిబిరం జరుగుతుందన్నారు. విశాఖ డీసీపీ విద్యాసాగర్ నాయుడు ముఖ్య అతిథిగా, ఏయూ క్రీడా విభాగం డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయమోహన్ గౌరవ అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

ఉద్యానవనంలా..



సుందరంగా మారిన సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయం



కార్యాలయ ఆవరణలో నాటిన మొక్కల సంరక్షణ చర్యల్లో సిబ్బంది

- తహసీల్దార్ కార్యాలయంలో పచ్చదనం పెంపునకు ప్రాధాన్యం
- ఆవరణలో వివిధ మొక్కల పెంపకం
- ప్రజలను ఆహ్వానిస్తున్న ఆహ్లాదకర వాతావరణం
- అర్జీదారులు, సిబ్బంది కోసం ప్రత్యేక సౌకర్యాలు

సీతమ్మధార: సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో అడుగడుగునా పచ్చదనం పలకరిస్తోంది. నాడు అధ్వాన స్థితిలో ఉన్న ఈ కార్యలయం.. నేడు చక్కని ఉద్యానవనంలా రూపురేఖలు మార్చుకుంది. కార్యాలయ ఆవరణలో అనేక రకాల మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దారు. ఒకప్పుడు చెత్తతో నిండిన కార్యాలయ పరిసరాలను ప్రజలు, సిబ్బంది సహకారంతో సుందరంగా మార్చారు. అక్కడి ఆహ్లాదకరమైన వాతావరణం.. ప్రజలు ఆహ్వానిస్తోంది. అర్జీదారుల కోసం కార్యాలయంలో అనేక సౌకర్యాలు కల్పించారు. సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా వీఆర్వోలు విధులు నిర్వహించేందుకు ఒక గదిని, రికార్డులు భద్రంగా దాచేందుకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ఒక స్థలం కేటాయించారు. తహసీల్దార్ కార్యాయానికి వచ్చే ప్రజల కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. కార్యాలయ ఆవరణలో పువ్వుల మొక్కలతోపాటు కొబ్బరి చెట్లకు జాతీయ జెండా రంగులు వేయించారు. సరికొత్తగా తహసీల్దార్ కార్యాలయం రూపాంతరం చెందింది.

సిబ్బంది శ్రమదానం..

తహసీల్దార్ పర్యవేక్షణలో కార్యాలయ సిబ్బంది మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. ఆవరణలో శ్రమదానం చేస్తూ చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించే కార్యక్రమం చేపడుతున్నారు. కార్యాలయ ఆవరణలో పచ్చదనం నిండేలా అనేక రకాల మొక్కలు నాటారు. ఇక్కడికి వచ్చే ప్రజలు ప్రశాంతంగా ఉండేలా ఈ కార్యక్రమం చేపట్టారు. రంగులు వేసి కార్యాలయాన్ని అద్భుతంగా తయారు చేశారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీలు సమర్పించేందుకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో అందుతున్న సేవలపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలకు నాణ్యమైన సేవలే లక్ష్యం



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న కె.కె.రాజు, పీలా వెంకటలక్ష్మి

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు రామకృష్ణానగర్–2 సచివాలయం పరిధి చిన్నూరు మసీదు ప్రాంతంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, వార్డు ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మితో కలిసి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. నివాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన సేవలందించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, వైఎస్సార్‌సీపీ 26వ వార్డు నాయకులు పోతు సత్యనారాయణ, బాబ్ జాన్, నవాబ్, ఎం.సునీల్, అనురాగ్, శేషు, బాబ్జి, పాండవ శ్రీను, రాయ్, అమ్మాజమ్మ, శ్యామల, గౌషియా, లలిత, అను, రమ, ఏపీడీ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంగీత కళాకారుల సేవ వెలకట్టలేనిది



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఆదినారాయణరావు, శశిప్రభ దంపతులు

సీతంపేట: సాంస్కృతిక సినీ సంగీత సంస్థ మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'నిన్ను కోరి వర్ణం' పేరిట నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆద్యంతం అందరినీ అలరించింది. పద్మశ్రీ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణరావు, శశిప్రభ దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాయనీ గాయకులు, సంగీత వాద్య కళాకారులు కళారంగానికి చేస్తున్న సేవ వెలకట్టలేనిదని కొనియాడారు. దేశ సంస్కృతి సంప్రదాయంలో కళలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా భావితరాలు వాటిని అందించవచ్చన్నారు. గాయనీ గాయకులు ఎం.ఎస్.మాధవ్, సిహెచ్.వి.సత్యనారాయణ, సురేష్‌కుమార్, రాము, రత్నం, లక్ష్మీనారాయణ, నాగ్, అభినయ్, శైలజామెరాజ్, కందర్ప రాధ, జ్యోతి, నిహారిక, లక్ష్మీసాత్విక, రితిక పలు హిట్ సాంగ్స్ ఆలపించి ప్రేక్షకులను అలరించారు. మెలోడీ క్రియేటర్స్ సంస్థ అధ్యక్షుడు సిహెచ్.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కళా సంఘాల ప్రతినిధులు కొణతాల రాజు, ఎస్.వి.విజయకృష్ణ, ఉషా చీరాల తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమా స్థాయిని పెంచిన అవార్డులు



మాట్లాడుతున్న ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో నెలవారీ చిత్ర ప్రదర్శనలో భాగంగా శనివారం సాయంత్రం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పలు జాతీయ అవార్డులు పొందిన మల్లేశం తెలుగు సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ ఇటీవల భారత ప్రభుత్వం ప్రకటించిన 69వ జాతీయ చలనచిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమాలు సత్తా చాటడం గర్వకారణమన్నారు. 69 ఏళ్లలో మొదటి సారిగా తెలుగు నటుడు అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడు పురస్కారం రావడం అభినందనీయమన్నారు. 11 అవార్డులు పొంది తెలుగు సినీ పరిశ్రమ స్థాయిని పెంచిందన్నారు. త్వరలో అవార్డులు పొందిన చిత్రాలతో రాష్ట్ర ప్రభుత్వ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో విశాఖలో ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బి.చిన్నారావు, శ్రీమన్నారాయణ, అనూరాధ, కాశీవిశ్వేశ్వరరావు, చాట్ల బాబూరావు, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై వృద్ధుడి మృతి



రెడ్డి రమణ మృతదేహం

సీతమ్మధార: ఒక వృద్ధుడు ఫుట్‌పాత్‌పై మృతి చెందిన ఘటన ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. విజయనగరం జిల్లా కోరుకొండకు చెందిన రెడ్డి రమణ(60) నగరంలో మురీలు అమ్ముతూ జీవించేవాడు. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో కైలాసపురం డీఎల్‌వో గ్రౌండ్స్ జంక్షన్ వద్ద ఫుట్‌పాత్‌పై స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. వైద్య సిబ్బంది వృద్ధుడిని పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ఫోర్త్ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అనారోగ్య కారణంతో చనిపోయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. సీఐ ఎస్.విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ కె.వి.రమణ

తాటిచెట్లపాలెం: కంచరపాలెంలోని ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో విశాఖపట్నం బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మదర్ థెరిసా జయంతి, మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.రమణ ప్రారంభించి, స్వయంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ ఆఫ్ ఓషన్‌సిటీ, వలంటీర్ ప్రెసిడెంట్ ఎస్.రాజకుమారి, సెక్రటరీ భారతి రోహ్రా, శ్యామలాదేవి, స్వర్ణలత, రోజ్‌లిన్ గ్రేస్ ఇతర మహిళా సభ్యులు, రోటరీ విశాఖ పోర్ట్ సిటీ యూఎస్ ఫార్మా ప్రెసిడెంట్ రామకృష్ణారావు, కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నమో వేంకటేశ



తిక్కవానిపాలెం వెంకన్న ఆలయంలో భక్తులు



ప్రత్యేక అలంకరణలో సంపత్ వేంకటేశ్వర స్వామి

కంచరపాలెం: శ్రావణ మాస శుద్ధ దశమి సందర్భంగా శనివారం స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గొల్ల కంచరపాలెం కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు శ్యామాచార్యులు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపారు. పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చనలు చేశారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఆలయంలో భక్తి సంకీర్తన నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

గెడ్డలో పడి వ్యక్తి మృతి



గెడ్డలో దాకమర్రి జగ్గారావు మృతదేహం

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేని ఒక వ్యక్తి గెడ్డలో పడి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా.. మధురవాడ వాంబే కాలనీలో దాకమర్రి జగ్గారావు(45), అతడి భార్య, ఇద్దరు పిల్లలు నివసిస్తున్నారు. జగ్గారావు మతిస్థిమితం లేక కొంతకాలంగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. అక్కయ్యపాలెం సాయిబాబా గుడి వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో అదే ప్రాంతంలోని వేణుగోపాల స్వామి ఆలయం ఎదురుగా ఉన్న గెడ్డలోకి మల విసర్జనకు దిగాడు. గెడ్డలో పడి జగ్గారావు మృతి చెందినట్లు స్థానికులు గుర్తించి ఫోర్త్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. జగ్గారావు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడని పోలీసులకు మృతుడి కుటుంబ సభ్యులు తెలియజేశారు. సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనం కోసం — అందుబాటులో అధికారులు

కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చు



జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 అధికారులు సమాచార హక్కు చట్టం–2005 ప్రకారం పౌర సమాచార అధికారులుగా సేవలందిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. జోన్ పరిధి 40 నుంచి నుంచి 63వ వార్డు వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అధికారుల ఫోన్ నంబర్లకు కాల్‌చేసి తెలియజేయవచ్చు. అవసరమైన పౌర సమాచారం అడిగి తెలుసుకోవచ్చు. జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు అర్జీలు సమర్పించవచ్చు.



రహదారులను శుభ్రం చేసే యంత్రాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ(ఫైల్)

జీవీఎంసీ జోన్–5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్ ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్–1 పీఐవో(రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్–2 పీఐవో(టౌన్ ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్–ఏ డీమ్డ్ పీఐవో(ఇంజినీరింగ్ విభాగం)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్–బీ డీమ్డ్ పీఐవీ(ఇంజినీరింగ్ విభాగం)	79979 54406
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్ డీమ్డ్ పీఐవో	88972 10764
రఘునాథ్	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో(టౌన్ ప్లానింగ్)	81878 99199
ఎం.శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ అధికారి	70932 87310
డాక్టర్ సునీల్‌కుమార్	ఏఎంహెచ్‌వో(పబ్లిక్ హెల్త్)	98485 02578
సూరిశెట్టి శేఖర్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జోన్–బీ డీమ్డ్ పీఐవో(వాటర్ వర్క్స్ విభాగం)	99480 78503
శ్రీనివాస్ వర్మ	డిప్యూటీ ఇంజినీర్ డీమ్డ్ పీఐవో (వాటర్ వర్క్స్ విభాగం)	99123 49448
ఎస్.జనార్దనరావు	శానిటరీ సూపర్‌వైజర్	70363 96919

పారిశుధ్య సమస్యా.. ఫోన్ చేయండి..!

జీవీఎంసీ జోన్–5 పరిధిలో ప్రజా ఆరోగ్యం, పారిశుధ్య సమస్యలపై సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చు. 42 నుంచి 51, 53, 54, 55 వార్డుల వరకు గల 13 వార్డులకు సంబంధించిన పారిశుధ్య సమస్యలు, చెత్త తొలగించపోయినా, గెడ్డలు, కాలువల్లో పూడికలు తీయకపోయినా, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా.. ఆయా వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు ఫోన్ కాల్ చేసి సమాచారం అందించాలని పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. వారు పట్టించుకోని పక్షంలో ప్రతి సోమవారం జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలో జెడ్సీ సమక్షంలో నిర్వహించే స్పందన కార్యక్రమంలో నేరుగా ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్ల సమాచారం

వార్డు	అధికారి	బాధ్యత	ఫోన్ నంబర్
41	ఎం.ప్రసాద్	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83942
42	ఎం.సన్యాసిదొర	హెల్త్ అసిస్టెంట్	77299 95924
43	అప్పారావు	బౌట్ సోర్సింగ్ ఇన్‌చార్జి	99665 91821
44	ఎస్.సూరిబాబు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83938
45	కె.పాండురంగా	హెల్త్ అసిస్టెంట్	99488 83932
46	వి.సత్యం	శానిటరీ ఇన్‌స్పెక్టర్	80085 36403
47	కె.వి.రమణమూర్తి	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83970
48	డి.అప్పలరాజు	శానిటరీ ఇన్‌స్పెక్టర్	90103 93037
49	ఎం.రామకృష్ణ	శానిటరీ ఇన్‌స్పెక్టర్	99488 83937
50	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్	94941 83244
51	ఎం.సుధాకర్	హెల్త్ అసిస్టెంట్ ఇన్‌చార్జి	94941 83244
54	వై.త్రిమూర్తులు	పిహెచ్ మేస్త్రీ	99488 83947
55	ఉప్పిలి కార్తీక్	హెల్త్ అసిస్టెంట్	91105 97632

జోరువాన.. హైరానా!



డైమండ్ పార్కు ప్రధాన రహదారిలో నిలిచిన మురుగు నీరు

సీతమ్మధార: నగరంలో శనివారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. చిన్న, పెద్ద కాలువలు పొంగిపొర్లాయి. డైమండ్ పార్కు వద్ద మురుగు నీరు నిలిచిపోవడంతో వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. మురుగు దుర్వాసన భరించలేక పాదచారులు ముక్కు మూసుకుని రాకపోకలు సాగించారు. దొండపర్తిలోని కొన్ని ప్రాంతాల్లో కాలువల నుంచి మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహించింది. వాన దెబ్బకు సీతమ్మధార రైతుబజారులో వ్యాపారాలు సాగక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తీసుకొచ్చిన కూరగాయలను పట్టుకుని వెనుతిరిగారు. సీతమ్మధార మెయిన్ రోడ్డులోని ఆంధ్రా బ్యాంక్ బయట నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వర్షం నీరు చేరింది. నక్కవానిపాలెం రోడ్డులో మురుగు నీరు చేరడంతో దుర్వాసన వెదజల్లింది. రేసపువానిపాలెం, కేఆర్‌ఎం కాలనీ ప్రాంతాల్లోని రహదారి గోతుల్లో నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. క్రాంతినగర్, గాంధీనగర్, 60 ఫీట్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని కాలువలు వాన నీటితో నిండాయి.

పదో రోజుకు శ్రావణలక్ష్మి పూజలు

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు శనివారానికి 10వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈవో కె. శిరీష తెలిపారు. పూజలకు సంబంధించి వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఏయూలో ఆంగ్ల పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం అధ్యాపకుడు డాక్టర్ ఎస్.రవి విన్సెంట్ రచించిన గ్లీనింగ్స్ ఆఫ్ గేజింగ్ పుస్తకాన్ని వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో ప్రజాస్వామ్య ఉల్లంఘన, జీవితంలో, సమాజంలోని రుగ్మతలు, సమస్యాత్మక వ్యాధులు, మూఢ నమ్మకాలు, పోలికలు– వైరుధ్యాలు, ఆశతో కూడిన దుర్భర జీవితాలు, అశాంతి, జింగోయిజం వంటి విభిన్న ఇతివృత్తాలను రవి విన్సెంట్ ఉద్వేగభరితంగా వివరించారు. యుద్ధ ప్రభావం, మానవ జీవితంలో వివిధ రూపాల్లో బాధలు, ప్రేమ కోసం వాంఛ, ప్రపంచంలోని అసమానతలు వంటి అనేక సమస్యలు ఈ పుస్తకంలో రచయిత చర్చించారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగం ఆచార్యుడు డాక్టర్ ఎస్.సాల్మన్ బెన్నీ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.